


రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:32 (మంగళవారం సాయంత్రం)
సహర్: 5:00 (బుధవారం ఉదయం)

చెరువులకు రైతులకు కడగండ్లు

ఈ ఫొటోలో కనిపిస్తున్నది నెల్లికుదురు మండలం రావిరాల చెరువు. రబీలో సుమారు 500లకు పైగా మొక్కజొన్న, వరి పంటలు చెరువు నీటిపై ఆధారపడి సాగయ్యేవి. ప్రస్తుతం గండ్లు పడడంతో చెరువులో నీరంతా బయటకు వెళ్లిపోయింది. రబీలో తీరని నష్టం జరిగిందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గండి పడి నెలలు గడిచినా శాశ్వత మరమ్మతు పనులు చేపట్టకపోవడం వల్ల తమకు అన్యాయం జరిగిందని రైతులు తలలు పట్టుకుంటున్నారు. మాకు సైతం ఉపాధి పోయిందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రావిరాలలో గండిపడడంతో నీరులేకుండా ఉన్న చెరువు

- రబీ సాగుకు అందని నీరు
- దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

నెలలు గడుస్తున్నా మరమ్మతు చేపట్టని వైనం

నెల్లికుదురు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): సాగు నీటికి ఆధారంగా నిలుస్తున్న చెరువుల నిర్వహణలో యంత్రాంగం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ఏళ్ల క్రితం నిర్మించిన చెరువు కట్టలు కాలక్రమేణా బలహీనపడ్డాయి. దీనికి తోడు వర్షాకాలం వచ్చిన భారీ వర్షాలకు అనేక చెరువులకు గండ్లు పడ్డాయి. మరికొన్ని కోతకు గురయ్యాయి. అయినా వాటి నిర్వహణ, శాశ్వత మరమ్మతులపై అధికారులు దృష్టి సారించడం లేదు.

పెద్ద ఎత్తున గండ్లు ..

వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా చెరువుల కుంటలు గండ్లుపడి తెగిపోయాయి. వరద ఉధృతికి పురాతన చెరువుకట్టలు తెగిపోవడంతో చెరువుల్లో నీరు లేకుండా పోయింది. కట్టకు మరమ్మతులు చేపట్టడానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి గండ్లు అక్కడే దర్శనమిస్తున్నాయి తెగిన చెరవులను జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ తోపాటు అధికారులు పరిశీలించి వెళ్లిపోయారని మరమ్మతులు చేపట్టడం లేదని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పడి నుంచి చెరువుల మరమ్మతులు చేపడితేనే వచ్చే ఖరీఫ్ వరకు చెరువులలో నీరు ఉంటుందని లేకుంటే సాగుకు దూరం కావలసిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు తెలుపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అకాల వర్షాలకు 131 చెరువులు తెగిపోగా కొన్నింటికి బుంగలు పడ్డాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

వేల ఎకరాల్లో నష్టం..

నెల్లికుదురులో ఖరీఫ్‌లో 2320 ఎకరాలలో వరి, 504 ఎకరాలలో పత్తి, 70 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో రాజులకొత్తపెల్లి చెరువు నాలుగు చోట్ల కట్టకు గండ్లు పడడంతో చెరువులో చుక్కనీరు లేదు. రైతులకు రబీలో తీరని నష్టం జరిగింది. మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. రావిరాల చెరువు తెగిపోవడంతో 80 ఎకరాల్లో వరిపొలాలు దెబ్బతిన్నాయి.

చెరువు కింద ప్రతి ఏటా 500 ఎకరాల్లో రబీ వరిసాగు చేసేవారు. చెరువు తెగిపోవడంతో 50 ఎకరాలు మేటలు ఏర్పడ్డాయి. కోతకు గురై పొలాలు పనికి రాకుండా పోయాయి. మునిగలవీడు చెరవు తెగిపోవడంతో 70 ఎకరాలు సాగుకు నోచుకోవడంలేదు. చెరువులో నీరు లేకపోవడంతో భూగర్భజలాలు ఉప్పొంగకపోవడంతో బోర్లు, బావులలో నీరు లేకుండాపోతున్నాయని రబీసాగు చేయలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధానమైన చెరువైన ఆలేరుపెద్ద చెరువు తెగిపోవడంతో ఎడారిగా మారింది. ఈ చెరువులోకి ప్రతి ఏటా ఎస్సారెస్పీ కాలువ నీరు వస్తుంది. నీండుకుండలా ఉండే చెరువు గండి పడి చుక్కనీరు లేకుండా ఎండిపోయింది. గండి పూడిస్తే చెరువు నిండే అవకాశం ఉన్నప్పటికీ గండిపూడ్చడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీరు ఉంటే 600 ఎకరాలు రబీ వరి సాగు చేసేవాళ్లమని సాగుకు నోచుకోవడంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కాచికల్ చెరువు తెగిపోవడంతో దిగవనున్న కట్టుకాలువ తెగిపోవడంతో గండ్ల పూడ్చే వారు కరువయ్యారు రబీ సాగుకు నీరు లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్రాహ్మణకొత్తపల్లి చెరువు మత్తడి తెడిపోవడంతో నీరు వెళ్లిపోయింది. చెరువులలో చేపలు లేకుండా పోయాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు తెగిపోవడంతో రైతులకు మత్స్యకారులకు తీవ్ర నష్టం జరిగింది.



రైతులకు రూ. 50 వేలు ఇవ్వాలి
పెరమాండ్ల బాలయ్య రైతు రాజులకొత్తపలి

చెరువులు గండ్లు పడడంతో పొలాలు కొట్టుకపోయి రైతులకు నష్టం జరిగింది. ఎన్ని ఎకరాలు నష్టపోయినా రూ 11వేలు మాత్రమే పరిహారం అందించింది. కొంతమంది రైతులకు పరిహారం అందలేదు. నష్టపోయిన రైతులందరికి రూ. 50 వేలు అందించాలి. చెరువు గండ్లను వెంటనే పూడ్చాలి.



ప్రతిపాదనలు పంపించాం..
రాందాస్, ఇరిగేషన్ డీఈ,

ప్రమాద స్థితిలో ఉన్న చెరువుల మరమ్మతు వివరాలు శాశ్వత ప్రతిపాదికన చేపట్టేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే చెరువుల శాశ్వత పనులు పటిష్టంగా చేసేలా చర్యలు తీసుకుంటాం. సమస్య పరిష్కరిస్తాం.

చెరువుల గండ్లు పూడ్చాలి..
-అస్లెంబ్లీలో మాట్లాడిన మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్

మానుకోట జిల్లాలో రికార్డు స్థాయిలో వర్షం కురిసిందని, నెల్లికుదురు, ఇనుగుర్తి మండలాల్లో 46 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీంతో కొన్ని చెరువులు గండ్లు పడ్డాయని, నెల్లికుదురు మండలం రాజులకొత్తపల్లి, రావిరాల చెరువుల మరమ్మతులు చేపట్టాలని సోమవారం శాసన సభ దృష్టికి ఎమ్మెల్యే తీసుకువచ్చారు. సంబంధిత మంత్రి వివరాలను నమోదు చేసుకున్నట్లు ప్రకటించారు.



రాజులకొత్తపల్లిలో చెరువు కట్టకు పడిన గండి (ఫైల్)



ఆలేరులో చెరువు కట్టకు గండి

దాశరథి స్మృతివనం ఏర్పాటు చేయాలి

- గూడూరులో అటవీ పర్యాటకానికి అనుకూలం
- తెగిన చెరువుల గండ్లు పూడ్చాలి
- అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించిన ఎమ్మెల్యే



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం అనంతారం దేవాలయ సమయంలో 11 ఎకరాల్లో దాశరథి స్మృతివనం ఏర్పాటు చేయాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ కోరారు. రాష్ట్ర అసెంబ్లీలో సోమవారం జీరో అవర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ అనుమతితో మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతారం దేవాలయానికి 11ఎకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం హయాంలో దాశరథి స్మృతివనంగా అభివృద్ధి చేయాలని అప్పటి జిల్లా కలెక్టర్ ప్రీతిమీనా సరిహద్దులు నిర్ణయించారని తెలిపారు. గత శాసనసభ్యుడు ఆ భూమిపై కన్నేసి ప్రభుత్వ భూమిని లాక్కునే ప్రయత్నం చేశాడని తెలిపారు. ఆ భూమిని తిరిగి ప్రభుత్వం స్వాధీనం చేసుకొని దాశరథి స్మృతివనంగా తీర్చిదిద్దాలని కోరారు. నియోజకవర్గంలో గిరిజనుల ప్రాధాన్యత సంతరించుకుని ఉంటుందని, గూడూరు మండలం భీమునిపాదం జలపాతానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారని, ఈ ప్రాంతానికి భూపతిపేట, గూడూరు వైపుల నుంచి రోడ్డుమార్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. భీమునిపాదం, బుగ్గచెలిమె, పులిమడుగు ప్రాంతాల్లో 240రకాల పక్షులు వస్తూ ప్రకృతి రమణీయతను కలిగి ఉంటాయని వీటిని పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. కొద్దినెలల క్రితం రికార్డు స్థాయిలో ఇనుగుర్తిలో 46 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందని, దీంతో కొన్ని చెరువులు గండిపడ్డాయని, రాజులకొత్తపల్లి, రావిరాల చెరువుల మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఎస్‌ఆర్‌ఎస్‌పీ కాల్వలను పూడికతీయించడం, ముళ్ల చెట్లను తొలగించాలని సభ దృష్టికి ఎమ్మెల్యే తీసుకురాగా సంబంధిత మంత్రి వివరాలను నమోదు చేసుకున్నట్లు ప్రకటించారు.

గ్రీవెన్స్ దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పొ

మహబూబాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రీవెన్స్‌లో సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అందించిన దరఖాస్తులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పొ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 69దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పొ మాట్లాడుతూ..

గ్రీవెన్స్‌లో వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఏ శాఖలోనైనా పెండింగ్‌లో ఉంటే వాటిని తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి, జిల్లా అధికారులు పురుషోత్తం, మధుసూదన్‌రాజు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు, నర్సింహామూర్తి, ప్రేమ్‌కుమార్, మరియన్న, సురేష్, ధనమ్మ, వీరన్న, శ్రీనివాస్, మదన్ మోహన్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్‌టొప్పొ

- మహబూబాబాద్ మండలం కంబాలపల్లి వద్ద ఉన్న చెక్ పోస్టును గత కొన్ని రోజుల క్రితం తొలగించారని దానిని పునరుద్ధరించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి, హిందూ సమాజ్ సభ్యురాలు దారా ఇందుభారతి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. కంబాలపల్లి వద్ద చెక్‌పోస్టును తొలగించడం వల్ల గోవుల రవాణా విచ్చలవిడిగా సాగుతోందని తక్షణమే చెక్‌పోస్టును ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో హిందూ సమాజ్ సభ్యులు శ్రవణ్, మహేష్, ప్రేమ్‌సాగర్, బద్రి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : అసెంబ్లీ సాక్షిగా అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాజు, కుంట ఉపేందర్ అన్నారు. సదరు డిమాండ్‌తో మహబూబాబాద్ తహసీల్ ఆఫీస్ ఎదుట సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్ వాడీ టీచర్స్ అండ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం 48 గంటల మహాధర్నా కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని అయినప్పటికి పాలకులు స్పందించడం లేదన్నారు. ఈ నెల 17,18 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 48 గంటల మహాధర్నా, వంట వార్పు, రాత్రి బస కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి నెలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలని కోరారు. అదే విధంగా ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎంశ్రీ నూతన జాతీయ విద్యావిధానాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అమలు చేయడాన్ని విరమించుకోవాలన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కుమ్మరికుంట్ల నాగన్న, సమ్మెట రాజమౌళి, అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెస్త సంపూర్ణ, దారా స్నేహబిందు, తిరుపతమ్మ, స్వరూప, నీలా, లలిత, ధనలక్ష్మి, మంగ, శైలజా,ఉమా, వీరలక్ష్మి, జ్యోతి, పద్మ, సమ్మక్క పాల్గొన్నారు.



అంగన్‌వాడీ టీచర్ల ఆందోళనలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజు

మునిసిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



చల్లా నర్సింహారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

తొర్రూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మునిసిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ నియోజకవర్గ ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మునిసిపాలిటీలో మౌలిక వసతుల మెరుగుదల, సీసీ రోడ్లు, మంచినీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుధ్యం, స్మార్ట్ లైటింగ్ వంటి అంశాలలో మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని రూ.50కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా చైర్మన్ నర్సింహారెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నిధుల మంజూరీపై ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అయ్యో రైతన్న..

సాగు నీటి కోసం కోటి కష్టాలు !



తండా ధర్మారం శివార్లోని ఆకేరు వాగులో నీటి గుంతలు తీస్తున్న యంత్రం

మరిపెడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మండల రైతులు సాగు నీటి కోసం కోటి కష్టాలు పడుతున్నారు. చేతికి అందే పంట కళ్ల ఎదుటే ఎండిపోతుంటే గుండెలు బాదుకుంటున్నారు. కొందరు రైతులు రెక్కలను పిండి చేస్తూ.. సాగు నీటికోసం అష్టకష్టాలు పడి మోటార్ల ద్వారా పంటలను కాపాడుకునే యత్నం చేస్తున్నారు. పెద్ద రైతులు నలుగురు ఐదుగురు కలిసి ప్రొక్లయిన్లను ఉపయోగిస్తూ గుంతలు తీస్తూ ఖర్చు భరించలేక కన్నీటి పర్యంతమవుతున్నారు. మండలం లోని ఆకేరు, పాలేరు నదుల పరివాహక రైతులు ఇరువైపులా వందల ఎకరాల వరి పంటను సేద్యం చేస్తున్నారు. ఎస్సారెస్పీ జలాలను విడుదల చేసి తమ పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

సబ్‌స్టేషన్ ఆపరేటర్ మృతి



యాకస్వామి (ఫైల్)

గూడూరు, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని విద్యుత్ సబ్ స్టేషన్‌లో పనిచేసే ఆపరేటర్ మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం బొద్దుగొండ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి చోటు చేసుకుంది. గూడూరు సీఐ సూర్యప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు మండలం పోలెపల్లి గ్రామానికి చెందిన తండ యాకస్వామి(40) గూడూరు మండలం భూపతిపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో కొన్ని నెలల నుండి పనిచేస్తున్నారు. గూడూరు మండల కేంద్రంలోని ఒక అద్దె ఇంట్లో ఆయన నివాసముంటున్నారు. యాకస్వామి కుటుంబసభ్యులతో కలిసి తొర్రూరుకు వెళ్లారు. భార్య, పిల్లలు అక్కడే ఉండగా యాకస్వామి ద్విచక్ర వాహనంపై గూడూరుకు బయలుదేరారు మార్గ మధ్యలో గూడూరు మండలం బొద్దుగొండ జాతీయ రహదారిపై యాకస్వామి ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలై యాకస్వామి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గూడూరు సీఐ సూర్యప్రకాష్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. మృతుడికి భార్య సంధ్య, కుమారుడు దినకర్, కుమార్తె అక్షిత ఉన్నారు.

నర్సింగ్ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన

నెహ్రూసెంటర్, మార్చి17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థినులకు సీపీఆర్, ప్రథమచికిత్సపై శిక్షణ ఇచ్చారు. అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్, ప్రథమచికిత్స దోహదపడుతుందని, ఐఆర్‌సీఎస్ జిల్లా చైర్మన్ పీవీ.ప్రసాద్, డీఎంఅండ్‌హెచ్‌వో గుండాల మురళీధర్ అన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.లీలా, ఐఆర్‌సీఎస్ వైస్ చైర్మన్ డాక్టర్ బానోత్ నెహ్రూ, కోశాధికారి ఎం.వెంకట్‌రెడ్డి, వైద్యులు విజయ్‌కుమార్, శిరీష, ప్రత్యూష పాల్గొన్నారు.



మహబూబాబాద్ నర్సింగ్ కళాశాలలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ఐఆర్‌సీఎస్ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ

ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలి

మహబూబాబాద్ అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పొ

మహబూబాబాద్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 2024-25 సంవత్సర రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉండాలని జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పొ అన్నారు. జిల్లాలో 432 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 1.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని చెప్పారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రానున్న ఏప్రిల్ మాసం నుంచి ప్రారంభం కానున్న రబీ ధాన్యం కొనుగోళ్లకు జిల్లా వ్యాప్తంగా అన్ని ఏజెన్సీలకు ఇప్పటికే కేటాయించిన కేంద్రాల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో వేసవి నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెనువెంటనే తరలించాలని సూచించారు. సివిల్‌సప్లై, రెవెన్యూ, సహకార, ఐకేపీ, పోలీస్, లీగల్ మెట్రాలజీ, మార్కెటింగ్, వ్యవసాయ, రవాణా శాఖలు సమన్వయంతో కలిసి పని చేసి జిల్లా లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. రైతులకు ధాన్యంకు సంబంధించిన డబ్బులను వెంటనే జమ అయ్యే విధంగా వారి వివరాలు స్వీకరించాలన్నారు. రైస్ మిల్లర్లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి కొనుగోలు కేంద్రాల వారికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మ చారి, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, మధుసూదన్‌రాజు, వెంకటేశ్వర్లు, విజయనిర్మల, ప్రేమ్‌కుమార్, డీఎస్పీ తిరుపతిరావు, కృష్ణవేణి, విజయ, మూర్తి, సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగు కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

ములుగు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, మొక్కజొన్న పంట వేసి నష్టపోయిన బాధిత రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతుసంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్డీ. అమ్జద్ పాషా మాట్లాడుతూ జిల్లాలోని గోదావరి తీర ప్రాంతంలో సింజంట కంపెనీ మొక్కజొన్న పంటను సుమారు 19 ఎకరాల్లో రైతులు సాగుచేశారని, విషపూరితమైన నకిలీ విత్తనాలు ఇవ్వడం మూలంగా రైతులు నష్టపోయారన్నారు. నష్టపోయిన బాధిత రైతులకు రూ.లక్షా50వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా పహణీ నకళ్ల ఆధారంగా రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయడంతోపాటు సన్నధాన్యం బోనస్ డబ్బులు వెంటనే చెల్లించాలని, అర్హులైన రైతులకు రైతుభరోసా ఇవ్వాలని, గోవిందరావుపేట మండలం లక్నవరం, వెంకటాపూర్ మండలం రామప్ప కాలువల రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం అందించాలని, మిర్చి రైతులకు క్వింటాకు రూ.25 వేల ధర చెల్లించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని, ములుగు జిల్లాలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. యాసంగి రైతులకు దేవాదుల నీటిని ములుగు మండలంలోని లక్నవరం ముంపు రైతులకు ఎస్సారెస్పీ కాలువ ద్వారా నెలరోజుల పాటు అందించాలన్నారు. ధర్నాకు సీపీఐ మండల కార్యదర్శి ముత్యాల రాజు, నాయకులు ఇంజం కొమురయ్య సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బండి నర్సయ్య, జక్కుల ఐలయ్య, సారయ్య, వాసం రమేష్, ధనసరి పాణి, మర్రి స్వామి, మహేందర్, సాంబయ్య, వెంకటరమణ, వెంకట్రాం తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం కుట్రలను తిప్పి కొట్టాలి

- ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను ప్రైవేటీకరించాలనుకోవడం సరికాదు
- కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలి
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరయ్య



మహాధర్నాలో మాట్లాడుతున్న వీరయ్య

ములుగు కలెక్టరేట్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద గర్భిణులు, బాలింతలు, పసిపిల్లలకు పౌష్టికాహారం అందిస్తూ పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్న ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందని, వాటిని అంగన్‌వాడీలు ఐక్యంగా తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.వీరయ్య అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం 48 గంటల మహాధర్నా, వంటావార్పు జరగ్గా వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను ప్రైవేటీకరించడానికి బడా కార్పొరేట్లకు, బహుళజాతి కంపెనీలకు ఫుడ్ సప్లయ్ బాధ్యతలను అప్పజెప్పే ఫుడ్ ప్యాకెట్లను కొని పంపిణీ చేయడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. ఈ చర్యల వల్ల భవిష్యత్తులో ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థ ఉండదని, నిరుపేద మహిళలకు పౌష్టికాహారం అందకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు అనుగుణంగానే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఐసీడీఎస్‌లో చేయడానికి నూతన జాతీయ విద్యా విధానం, పీఎంశ్రీ పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయడానికి పూనుకుంటుందన్నారు. పూర్వ ప్రాథమిక విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ పిల్లలను విద్యావ్యవస్థలో విలీనం చేయడానికే పీఎంశ్రీ పథకమన్నారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాల్సిందిపోయి కొత్తకొత్త సంస్కరణలతో ఐసీడీఎస్‌ను భ్రష్టు పట్టిస్తోందన్నారు. అదేవిధంగా అంగన్‌వాడీలకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందించాలని, మంత్రి సీతక్క ఇచ్చిన హామీ ప్రకారం రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.2లక్షలకు పెంచి జీవో విడుదల చేయాలని, రిటైర్డు అయినవారికి ఆసరా పింఛన్లు మంజూరు చేయాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా కనీస వేతనం రూ.18వేలు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎమ్డీ.దావూద్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎమ్డీ.గఫూర్‌పాషా, నాయకులు సోమ మల్లారెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టీఎల్.రవి, అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కూరెందుల సమ్మక్క, నాయకురాళ్లు పద్మారాణి, సరిత, రమ, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, వెంకటరమణ, పార్వతి, లక్ష్మీనర్సమ్మ, సుమలత, రుక్మిణి, నిర్మల, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఆర్.నీలాదేవితో పాటు జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించలేని ప్రభుత్వాలు

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా తాగు నీరు, విద్యుత్ సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్న వారి సమస్యలను పరిష్కరించలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్ వీరయ్య విమర్శించారు. వాజేడు మండలం నుంచి ఏటూరునాగారం ఐటీడీఏ వరకు గుడిసె వాసులు తాగునీటి, విద్యుత్తు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పాదయాత్ర చేపట్టి ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఇందులో పాల్గొన్న వీరయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదివాసీల సమస్యలు పట్టడం లేదని, నిరుపేదలకు వంద గజాల స్థలమిచ్చి సొంత ఇళ్లు నిర్మించి ఆదుకోవాలన్న విషయాలు ప్రభుత్వాలకు పట్టడం లేదని దుయ్యబట్టారు.

ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందే నిరుపేదలకు వంద గజాల స్థలం కేటాయించి ఇళ్లు నిర్మిస్తానని హామీనిచ్చారని, దాని గురించి ఇప్పటి వరకు ముందుడుగు పడలేదని అన్నారు. 10 ఏళ్లు సీఎంగా పని చేసిన కేసీఆర్ డబులు బెడ్‌రూం ఇళ్ల పేరుతో మోసం చేసి నేడు ఫామ్‌హౌస్‌లో సేద తీరుతున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్య వర్గ సభ్యులు ఎమ్డీ దావూద్, పొదిళ్ల చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి చిరంజీవి, రాజేష్, దామోదర్, దేవయ్య, కృష్ణబాబు, పూనెం కృష్ణ, బత్తుల సంతోష్, నరేష్, చంద్రశేఖర్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు చిక్కిన మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ ?

- రాజలింగమూర్తి హత్య కేసులో ఎనిమిదో నిందితుడు
- క్రెడిట్‌కార్డు లావాదేవీల ఆధారంగా దొరికిన ఆచూకీ
- ఢిల్లీలో అదుపులోకి తీసుకున్న భూపాలపల్లి పోలీసులు ?

కృష్ణకాలనీ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 19న జరిగిన సామాజిక కార్యకర్త రాజలింగమూర్తి హత్య కేసులో కీలక సూత్రధారి, ఎనిమిదో నిందితుడిగా ఉన్న బీఆర్ఎస్ నేత, మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ కొత్త హరిబాబు ఎట్టకేలకు పోలీసులకు చిక్కినట్టు తెలుస్తోంది. బుధవారంతో హత్య జరిగి నెల రోజులు అవుతున్న క్రమంలోనే ఈ కేసులో పోలీసులు పురోగతి సాధించారు. ఇన్ని రోజులుగా జిల్లాపోలీసు యంత్రాంగాన్ని ముప్పు తిప్పలు పెడుతూ తప్పించుకొని తిరుగుతున్న హరిబాబు ఢిల్లీలో ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి ఢిల్లీకి వెళ్లిన అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. హత్య జరిగిన గంటల వ్యవధిలో అదృశ్యమైన కొత్త హరిబాబు ఆచూకీ ఇన్నాళ్లు పోలీసులకు లభించలేదు. పోలీసులు ఉద్దేశపూర్వకంగానే ఆయన్ను అరెస్టు చేసే విషయంలో మెతక వైఖరి అవలంబిస్తున్నారని రాజలింగమూర్తి కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీంతో పాటు ఈ నెల 11న డీజీపీకి సైతం రాజలింగమూర్తి భార్య ఫిర్యాదు చేశారు. దీంతో చాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు హరిబాబుకు సంబంధించిన ఫోన్ డేటా, ఆధార్, ఫోన్‌నెంబర్లతో లింక్ అయి ఉన్న బ్యాంకు ఖాతాలు, క్రెడిట్ కార్డుల లావాదేవీలపై నిఘా పెట్టారు. ఈ క్రమంలో హరిబాబుతో పాటు ఆయన సన్నిహితుల ఖాతాలు, క్రెడిట్ కార్డులపై కూడా నజర్ వేశారు. ఈ క్రమంలో పోలీసుల పరిశీలనలో ఉన్న క్రెడిట్ కార్డుల్లో ఒకదానిపై ఢిల్లీలో లావాదేవీలు జరిగాయన్న విషయాన్ని తెలుసుకున్నట్టు వెల్లడైంది.

దీంతో వెంటనే అప్రమత్తమైన ఎనిమిది మంది పోలీసులను నాలుగు బృందాలుగా విడగొట్టి ఆయన్ను పట్టుకొనేందుకు ఢిల్లీకి పంపారు. క్రమంలో పోలీసులు అనుమానించినట్టుగానే సంబంధిత ప్రాంతంలో ఆయన కదలికలను గుర్తించి ఆదివారం రాత్రి అదుపులోకి తీసుకున్నట్టు పోలీసు శాఖకు చెందిన విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇదిలా ఉండగా జిల్లా పరిధిలోని ఓ పోలీస్‌స్టేషన్‌లో ఉంచిన ఆయన్ను మంగళవారం అరెస్టు చూపించనున్నట్లు తెలిసింది. కాగా, ఈ హత్య కేసులో పదో నిందితుడిగా ఉన్న పుల్ల సురేష్ ఇంకా పట్టుబడాల్సి ఉంది

రౌడీషీట్ ఓపెన్ ?

రాజలింగమూర్తి హత్య కేసుతో పాటు గతంలో హరిబాబుపై పలు రకాల కేసులు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో హత్య జరిగిన తర్వాత ఏడుగురు నిందుతుల అరెస్టును చూపిన ఎస్పీ కిరణ్‌ఖరే పరారీలో ఉన్న హరిబాబు వివరాలు వెల్లడించారు. త్వరలోనే ఆయనపై రౌడీషీట్ కూడా ఓపెన్ చేస్తామని ప్రకటించారు. దీంతో వివిధ రకాల కేసులను పరిగణనలోకి తీసుకోవడంతోపాటు శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించారనే కారణాలతో ఆయనపై రౌడీషీట్ సైతం ఓపెన్ చేసినట్లు సమాచారం.

బాధ్యతలు స్వీకరించిన ట్రైబల్ వర్సిటీ వీసీ



శ్రీనివాస్‌ను అభినందిస్తున్న ములుగు కలెక్టర్ దివాకర

ములుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లాలోని సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఉప కులపతిగా వై.ఎల్.శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ములుగు మండలం జాకారంలోని వర్సిటీ తాత్కాలిక క్యాంపస్‌లో విధుల్లో చేరిన ఆయనకు ఓఎస్డీ వంశీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది స్వాగతం పలికారు. అంతకు ముందు తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ, వనదేవతల గద్దెలను దర్శించుకున్న వీసీ సంప్రదాయ పూజలు చేశారు. పూజారులు ఆయనకు కండువా కప్పి ప్రసాదం అందజేశారు. అనంతరం కలెక్టర్ టీఎస్. దివాకరను వీసీ శ్రీనివాస్ కలిశారు.

వడదెబ్బతో ఒకరి మృతి



రాజు మృతదేహం

కేసముద్రం, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి) : కేసముద్రం మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున ముత్యాలమ్మగుడి సమీపంలో పెద్దవంగర మండలం ఉప్పరిగూడెంకు చెందిన దుంపల రాజు(48) వడదెబ్బతో మృతి చెందినట్లు ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. ఉదయం గుర్తుతెలియని వ్యక్తి ముత్యాలమ్మగుడి వద్ద మృతి చెందినట్లు సమాచారం అందడంతో పోలీసులు మృతుని ఫొటోలతో సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ సమూహాలకు పంపించారు. దీంతో మృతుడికి సంబంధించిన వారు గుర్తించి పోలీసులను సంప్రదించారు. మృతుడు నెల రోజుల క్రితం ఇంట్లోంచి వెళ్లిపోయి ఆచూకీ తెలియకుండా వివిధ ప్రాంతాలు తిరుగుతున్నాడని, మద్యానికి బానిసై ఆహారం సరిగా తీసుకోకుండా వడదెబ్బ తగిలి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య హైమ, కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు సాయికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

విద్యుదాఘాతంతో మహిళ..

డోర్నకల్, మార్చి 17 (ఆంధ్ర జ్యోతి) : విద్యుదాఘాతానికి గురై మహిళ మృతి చెందిన సంఘటన డోర్నకల్ మండలం గుర్రాలకుంట తండాలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రాలకుంట తండాకు చెందిన నూనావత్ సరు (40) భర్త రాము లు కలిసి వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం కూలీ పనులకు వెళ్లిన భార్యాభర్తలు ఇంటికి వచ్చారు. ఆపై సరు ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్ స్విచ్ ఆన్ చేయడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ రాజేష్‌ను వివరణ కోరగా తమకు ఇప్పుడే సమాచారం అందిందని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

డీడీ దేశిరాం నాయక్



కొత్తగూడలో ఎంపికను ప్రారంభిస్తున్న ఐటీడీఏ డీడీ దేశిరాం నాయక్

కొత్తగూడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీడీ దేశిరాం నాయక్ సూచించారు. ఐటీడీఏ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశ ఎంపికను సోమవారం కొత్తగూడలో డీడీ దేశిరాం నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. కొత్తగూడలోని ఐటీడీఏ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో విద్యార్థుల ప్రవేశ ఎంపికలో 70మంది విద్యార్థులు పాల్గొన్నారు. బోయిన్‌పల్లిలో మోడల్ వాటర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు 10విద్యార్థినిలు, 10మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏసీఎంవో రాములు, ఏటీడీవో భాస్కర్, హెచ్ఎం సారయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్ సీహెచ్ కొమ్మాలు, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానుకోట మార్కెట్‌కు 16 వేల మిర్చి బస్తాల రాక

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మార్కెట్‌కు భారీగా మిర్చి రాబడులు వచ్చాయి. సోమవారం 16 వేల బస్తాలకు పైగా మిర్చి రాబడులు కొనసాగాయి. ఉదయం ఈ నామ్‌లో 7218 బస్తాలు వేలం పాటలు కొనసాగగా వ్యాపారులు కొనుగోలు చేపట్టారు. మిగతా సుమారు 8 వేల బస్తాలు ఇంకా మార్కెట్ యార్డులో మిగిలి ఉన్నాయి. మంగళవారం, బుధవారం వేలం పాటల కోసం మార్కెట్ అధికారులు చేతిరాతతో ఉన్న టోకెన్‌లను మిర్చి రైతులకు అందించారు. సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం వచ్చే బస్తాలను కూడ వారు బుధవారం వేలం పాటల్లో పాల్గొనేందుకు తీసుకోనున్నారు. పండుగ తర్వాత మార్కెట్ పునఃప్రారంభం కావడంతో భారీగా మిర్చి రాబడులు వచ్చాయి. తేజరకం మిర్చి క్వింటాకు గరిష్ట ధర రూ.13811 పలుకగా, కనిష్ట ధర రూ.10681 పలికింది. సగటున రూ.12650 ధర పలికింది.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు	2216	2100
పల్లికాయ (సూక)	7150	6500
పల్లికాయ (పచ్చిది)	4400	3400
కందులు	6652	5540
పెసళ్లు	7407	4645
పత్తి	6825	5800
దీపిక	16000	15245
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13500	9000
తేజ ఏసీ	16500	14000
వండర్‌హాట్	15800	11500
యూఎస్341	13000	9500
దేశీ	30000	25500
సింగిల్‌పట్టి	32000	35000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

మొక్కజొన్న రైతులతో ఆర్డీవో సమావేశం

నష్ట పరిహారంపై చర్చ

ములుగు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట సాగుచేసి దిగుబడి రాక నష్టపోయిన వెంకటాపురం, వాజేడు, కన్నాయిగూడెం మండలాల రైతులు, సింజెంటా, బేయర్ విత్తన కంపెనీల ప్రతినిధులతో ములుగు ఆర్డీవో వెంకటేష్, జిల్లా వ్యవసాయాధికారి సురేష్ సోమవారం సమావేశమయ్యారు. జిల్లా కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో ఈ సమావేశం జరిగింది. ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లించేందుకు సూత్రప్రాయంగా నిర్ణయించారు. అయితే అదనంగా పరిహారం చెల్లించాలని రైతుల పక్షాన కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఇటీవల క్షేత్రస్థాయిలో చేసిన పంటల సర్వే నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన తర్వాత నిర్ణయాన్ని వెల్లడిస్తామని, పరిహారం మొత్తాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాలలో జమచేయడం జరుగుతుందని ఆర్డీవో తెలిపారు.



రైతులు, విత్తన కంపెనీల ప్రతినిధులతో సమావేశమైన అధికారులు

నిట్ చైర్‌పర్సన్ విధుల అప్పగింతపై సవరణ

వరంగల్ నిట్ -2017 స్టాచ్యూట్‌లో సబ్‌సెక్షన్ 4 చేర్పు

హనుమకొండ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఏదైనా కారణం వల్ల బోర్డ్ ఆఫ్ గవర్నర్ చైర్‌పర్సన్ విధుల్లో లేని కాలంలో ఆయన బాధ్యతలను మరో జాతీయ ప్రాధాన్యత కలిగిన ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్‌కు అప్పగించే విషయంలో సవరణ చేస్తూ వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి గెజెట్ నోటిఫికేషన్ జారీ చేశారు. బోర్డ్ ఆఫ్ గవర్నర్ చైర్‌పర్సన్ పదవీ కాలం ముగియడం, మృతి చెందడం, రాజీనామా చేయడం లేదంటే ఇతరత్రా కారణాల వల్ల ఖాళీ అయినా.. అనారోగ్యం, గైర్హాజరు లేదా మరే కారణం వల్ల విధులు నిర్వహించలేక పోయినా చట్టంలోని 16వ సెక్షన్ ప్రకారం ఆయన స్థానంలో జాతీయ ప్రాధాన్యత కలిగిన మరో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ చైర్‌పర్సన్‌కు అప్పగిస్తూ సవరణ చేశారు. అయితే ఈ బాధ్యతల అప్పగింత కాలపరిమితి ఆరు నెలల వరకు లేదంటే ఒక వేళ చైర్‌పర్సన్ కాలపరిమితి ముగిసిన పక్షంలో మరో రెగ్యులర్ చైర్‌పర్సన్ నియామకమయ్యే వరకు వరంగల్ నిట్ విజటర్ ఆమోదం మేరకు అమలులో ఉంటుంది. ఈ మేరకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ స్టాచ్యూట్స్ -2017లో సబ్-స్టాచ్యూట్ (4)ను చేర్చడం ద్వారా ఈ సవరణ చేశారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, వరంగల్-2017ను ఇక నుంచి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ స్టాచ్యూట్-2025గా పిలుస్తారు.

ఈజీఎస్‌లో ఇష్టారాజ్యం

తనిఖీల్లో బయట పడుతున్న అవకతవకలు

తొర్రూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తొర్రూరు మండలంలో జాతీయ ఉపాధిహామీ (ఈజీఎస్) పథకంలో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించి అవకతవకలు పాల్పడిన విషయాలు సామాజిక తనిఖీల్లో వెలుగులోకి వస్తున్నాయి. 2023-2024 సంవత్సరంలో మండలంలోని 29 గ్రామాల్లో కూలీలకు రూ.3,38,50,285 చెల్లించగా, మెటీరియల్ పేమెంట్‌గా రూ.26,56,609 మొత్తం రూ.3,62,06,894 పనుల జరిగాయి. జరిగిన పనులకు గాను 15వ విడత సామాజిక తనిఖీ బృందం మూడు రోజుల పాటు తనిఖీలు నిర్వహించారు. సోమవారం వెల్లికట్టె, వెంకటాపురం, మడిపల్లి, చెర్లపాలెం, గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి తనిఖీ వివరాలను వెల్లడించారు. వెల్లికట్టె గ్రామంలో రూ.19,83,214 వెజిపేమెంట్, మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.40,371 పనులు జరిగాయి. సిబ్బంది మస్టర్లను దిద్ది కూలీలు చేసిన పనికి తక్కువ, చేయని పనికి ఎక్కువగా కూలీ డబ్బులు జమ చేశారు. ఎం.ఐ ట్యాంకు వద్ద 48 మంది కూలీలు పనులు చేయగా రూ.9,167 చెల్లించలేదు. క్వాంటిటీ తక్కువ చేసి రూ.3,353 బిల్లులు చేయడం జరిగింది. ఎంబీ రికార్డులు తక్కువ రికార్డు చేసి పేమెంట్ ఎక్కువగా చేసినట్లు తనిఖీ బృందం వెల్లడించారు. పోస్టాఫీసులో కూలీల డబ్బుల జమ అయిన కూడా కూలీలకు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. వెంకటాపురంలో మస్టర్ ముగిసిన తర్వాత హాజరువేసుకొని రూ.3,446, ఫీడర్ చానల్ వర్క్‌లో ఎలాంటి రికార్డు క్లియర్ చేయకుండానే రూ.59వేలు చెల్లించారు. ఎలాంటి సంతకాలు లేకుండానే రూ.3500 చెల్లించారు. చెర్లపాలెంలో ఈకేవైసీ లేదంటూ పనులు చేసిన వారికి డబ్బులు చెల్లించలేదు. పని చేయని కొంత మందికి సిబ్బంది పేమెంట్ చేసి డబ్బులు చెల్లించారు. ప్రతి గ్రామంలో టీఏ, ఎఫ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరించి అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించారు. అయితే అవకతవకలపై తనిఖీ బృందం వివరణ కోరగా పొంతనలేని సమాధానాలు ఇస్తూ సీవో, సాంకేతిక కారణం వల్లనే ఇలా జరిగిందంటూ తప్పించుకుంటున్నారు. ఆయా గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి ప్రభు, ఎస్సార్పీ చెన్నకేశవ్, డీఆర్పీ వికాస్, శ్రీశైలం, రామ్మూర్తి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



వెల్లికట్టెలో సామాజిక తనిఖీల్లో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ వికాస్

నిరంతర సాధన అవసరం



నేటి ఆధునిక ప్రపంచంలో కంప్యూటర్లు వచ్చి చేతి రాతకు పెద్దగా పనిలేకుండా చేశాయి. దీనికి తోడు చాలా విద్యాసంస్థలు కేవలం బట్టీ పట్టించేందుకు చదువు మీద పెట్టిన శ్రద్ధను విద్యార్థుల చేతి రాతపై పెద్దగా పెట్టడం లేదు. దీని వల్ల పరీక్షల్లో జవాబులు అన్నీ సరిగానే రాసినప్పటికి అందమైన చేతి రాత లేక మార్కులు తగ్గిపోయి విద్యార్థులు నష్టపోతున్నారు. అందుకు ఒక్కసారి అందంగా రాయడం నేర్చుకుంటే జీవితాంతం అందంగానే రాయవచ్చు.

- రెడ్డిమల్ల వెంకటస్వామి, తెలుగు ఉపాధ్యాయుడు, ల్యాబర్తి

అందమైన రాత చాలా ముఖ్యం



చదవడంలో ఎన్ని మార్పులు వచ్చినా, అలాగే ఆన్‌లైన్ పుస్తకాలు చదవి పరీక్షలు రాసే పద్ధతి వచ్చినా చేతి రాతకు ఉండే ప్రాముఖ్యత నేటికీ తగ్గలేదు. ఇందుకోసం ప్రతీ విద్యార్థికి అందమైన చేతి రాత అనేది చాలా ముఖ్యం. పరీక్షల్లో రాసే జవాబులు అందంగా కనిపిస్తే పేపర్లు దిద్దే వారు గుర్తించి అదనపు మార్కులు వేసే అవకాశాలున్నాయి. విద్యార్థులు చదువుతో పాటు చేతి రాతకు కూడా ప్రాధాన్యమివ్వాలి. చదివింది, రాయడం వల్ల చాలా వరకు గుర్తుండిపోతుంది.

- పోగుల నాగరాజు, జీవశాస్త్రం ఉపాధ్యాయుడు, ల్యాబర్తి

చేతి రాత.. మారాలి!

అక్షరాలు అందంగా ఉంటే మరిన్ని మార్కులు

- సాధన చేస్తేనే అలా రాయడం సాధ్యమంటున్న ఉపాధ్యాయులు
- పదో తరగతి విద్యార్థులకు మరింత మేలు
- 21 నుంచి వార్షిక పరీక్షలు

వర్ధన్నపేట రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : కంప్యూటర్‌పై క్షణాల్లో అందమైన అక్షరాలను తీర్చిదిద్దగల ఈ ఆధునిక యుగంలో, చేతి రాతకున్న ప్రత్యేకత ఏమాత్రం తగ్గలేదు. చేతి రాతను బట్టి వారి గుణగణాలను చెప్పవచ్చనేది నానుడి. పరీక్షల వేళ జవాబు పత్రాలు దిద్దే ఉపాధ్యాయులకు అక్షరాలు అందంగా కనిపించేలా జవాబులు రాస్తే చాలు ఇక అదనపు మార్కులు సాధించవచ్చని వేరే చెప్పక్కర్లేదు. ఇందుకోసం విద్యార్థులు నిరంతరం సాధన చేస్తేనే అందమైన చేతి రాత సాధ్యమవుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతీ విద్యార్థి చేతి రాతకు ఉన్న గుర్తింపు గురించి తెలుసుకుని, అందుకు అనుగుణంగా మార్చుకుంటేనే భవిష్యత్తులో అన్నింటికి ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఇంటర్మీడియట్ ఎగ్జామ్స్ ప్రారంభం కాగా, పదో తరగతి పబ్లిక్ పరీక్షల వేళ చేతి రాతపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

పరీక్ష సమయంలో తడబాటు..

పరీక్షల గంట మోగింది. ఈనెల 21వతేదీ నుంచి ఏప్రిల్ 4 వరకు పది పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలు అంటే విద్యార్థులకు తెలియని భయం. ఆ భయంతో పరీక్షల్లో ఇచ్చిన ప్రశ్నలకు జవాబులను రాసే క్రమంలో చేతి రాత వంకరటింకరగా వస్తుంది. ఇంకొందరు విద్యార్థులు ముందుగా అందంగానే మొదలు పెట్టినప్పటికీ, పోనుపోను అందంగా రాయలేక ఇష్టం వచ్చినట్లు రాస్తుంటారు. దీంతో ప్రశ్నలకు, జవాబులు సరిగా రాసినప్పటికి చేతి రాత సరిగా లేకపోవడంతో పేపర్లు దిద్దే వారికి సరిగా అర్థం కాకపోవడం వల్ల మార్కులు కూడా తగ్గే ఆస్కారం ఉంది. కాబట్టి ముందు నుంచే విద్యార్థులు చేతి రాతపై దృష్టి పెట్టాలి. చదివిన దానిని చేతి రాతతో రాయడం వల్ల మరిచిపోయే అవకాశాలు తక్కువగా ఉంటాయి. కాబట్టి రాయడం వల్ల అందమైన దస్తూరి రావడంతో పాటు చదివింది కూడా గుర్తుకు ఉండడానికి ఉపకరిస్తుంది. ఇలా రెండు రకాలుగా తోడ్పడుతుంది. అందమైన చేతి రాతతో అక్షరాలను పొందికగా ముత్యాల్లాగా పేర్చి ఆకర్షించే విధంగా జవాబులు రాయడం వల్ల పేపర్లు దిద్దే వారికి రాసిన జవాబులు అందంగా కనిపిండడంతో అదనపు మార్కులు పొందే అవకాశాలు చాలా ఉన్నాయి.



ల్యాబర్తిలో పదో తరగతి వార్షిక పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు



విద్యార్థులు పాటించాల్సిన జాగ్రత్తలు...

- విద్యార్థులు పరీక్షల్లో జవాబులు రాసేటపుడు అక్షరాలు పొందికగా, ముత్యాల్లాగా పేర్చినట్లు అందంగా కనిపించాలి. అదేవిధంగా స్పష్టంగా రాయాలి.
- ఒక్క పేజీలో కేవలం 16 నుంచి 18 లైన్లు మాత్రమే వచ్చే విధంగా రాయడం మంచిది.
- సమాధాన పత్రం పైకి, కిందికి పక్కలకు బార్డర్లకు వదిలి సమానంగా రాయాలి.
- పరీక్ష రాసేటపుడు ఒద్దికగా పూర్తిగా అనుకూలంగా కూర్చోని రాయాలి.
- తెలుగు, హిందీ, అక్షరాలను నాలుగు మి.మీ.లే, ఇంగ్లీష్ అక్షరాలను మూడు మి.మీ.లు ఉండే విధంగా చూసుకోవాలి.
- అక్షరాలు, పదాలు, లైన్‌ల మధ్య తగినంత గ్యాప్ ఉండేలా చూసుకోవాలి.
- అక్షరాలను ఒత్తిపెట్టి రాయకూడదు. అలా రాయడం వల్ల పేజీ వెనుక భాగం వైపు కనిపిస్తుంది. దీని వల్ల వెనక వైపు ఉన్న రాత కూడా కనిపించకుండా పోయి నష్టపోవాల్సి వస్తుంది.
- గణితంలో సమీకరణాలు, సైన్స్‌లో పటాలు, పోటీభాగాలు అందంగా కనిపించే విధంగా రాయాలి.
- జవాబులు రాసేటపుడు వాటికి సైడ్ హెడ్డింగ్‌లు. పేరాలు చేయాలి.
- తెలుగు, ఇంగ్లీష్ రాసేటప్పుడు ఎప్పుడు సవ్య దిశలోనే రాయాలి.

చెట్ల నీడన చదువు..

ఓవైపు ఎండలు మండుతున్నాయి. మరోవైపు ఇంటర్ విద్యార్థుల్లో వార్షిక పరీక్షల వేడి. ఈ క్రమంలో వారు మంచి మార్కులు పొందాలంటే అనువైన వాతావరణం ఉండాలి. ప్రకృతి కన్నా అనువైన వాతావరణం ఏముంటుంది. మరీ ముఖ్యంగా చెట్ల నీడలో చదువుకోవడం కంటే ఆనందం ఇంకేముంటుంది. అందుకే భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని మైనారిటీ కళాశాలలో విద్యార్థులు ఇదిగో ఇలా అందరూ చెట్ల నీడన కుర్చీలు వేసుకుని కూర్చుని చదువుకుంటున్నారు.



చెట్ల నీడలో కూర్చొని పరీక్షకు సిద్ధమవుతున్న ఇంటర్ విద్యార్థులు

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, జయశంకర్ భూపాలపల్లి



మహబూబాబాద్‌లో జయరాజ్‌ను సన్మానిస్తున్న ఘనపురపు అంజయ్య దంపతులు

తెలంగాణ సంస్కృతి అంటేనే పాట

- కడుపులో తూటాలు పెట్టుకుని పోరాడిన యోధుడు గద్దర్
- గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రకటించడం గొప్ప విషయం
- ప్రయుఖ కవి, గాయకుడు గొడిశాల జయరాజ్

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సంస్కృతి అంటేనే పాట అని, ఏ ఉద్యమానికైనా ఆ పాట వెన్నుదన్నుగా, ముఖ్య భూమికగా నిలిచిందని ప్రముఖ కవి, గాయకులు గొడిశాల జయరాజ్ అన్నారు. తన సొంతూరు మహబూబాబాద్ పట్టణానికి విచ్చేసిన ప్రముఖ కవి, గొడిశాల జయరాజ్‌ను సోమవారం కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జయరాజ్ విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా నిలిచిన పోరాటయోధులకు గత పదేళ్లలో ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక కవులకు తగిన గుర్తింపు లభిస్తోందన్నారు. ప్రముఖ కవి అందెశ్రీ రచించిన పాటను తెలంగాణ గీతంగా ప్రకటించడం, తన కడుపులో తూటాలు పెట్టుకుని పోరాడిన యోధుడు గద్దర్ పేరిట సినీ అవార్డులను ప్రకటించడం గొప్ప విషయమని తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గద్దర్‌ను సినీ పరిశ్రమను విడదీయలేరని 'బండెనక బండి కట్టి.. ఏ బండ్లె పోతావు కొడుకో.. నైజాం సర్కరోడా' అంటూ గద్దర్ రాసిన, పాడిన అనేక పాటలు వెండితెరపై ఉగ్రూతలూగాయని చెప్పారు. వెండి తెరనుంచి గద్దర్‌ను తొలగించలేరని, సినీ పరిశ్రమకు ఆయన పెద్ద దిక్కుగా నిలిచారని వివరించారు. సాంస్కృతిక చిహ్నంగా గద్దర్ పాటలు నిలిచాయని తెలిపారు. విద్యార్థి ఉద్యమాలు.. విప్లవోద్యమమైనా.. తెలంగాణ ఉద్యమంలోనైనా కవిగా నిలబడడానికి ఘనపురపు అంజయ్య తనకు వెన్నుదన్నుగా నిలిచారని చెప్పారు.

ఉద్యానవనంలో యువజోష్

- కొత్తవంగడాలతో కాసుల పంట
- ప్రత్యామ్నాయ సాగులో ఆదర్శంగా రైతులు

తొర్రూరు రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయం చేయడమంటేనే అప్పులు, ఆత్మహత్యలు అంటూ వదిలేసి, చిన్న ఉద్యోగమైనచాలని పట్టణాల వైపు పరుగులు పెడుతున్న రోజులివి. కానీ వ్యవసాయం దండగ కాదు పండుగని నిరూపిస్తున్నారు ఈ యువ రైతులు. తమ తల్లిదండ్రులు నమ్ముకున్న భూమినే అమ్మలా భావించిన ఆ యువకులు ఉద్యానపంటల్లో కొత్త వంగడాలను ఎంచుకుంటూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం వరి, పత్తి, మిర్చి పంటలు సాగు చేసి.. వ్యాపించే తెగుళ్లు, రోగాలతో రైతులు అప్పుల పాలువుతున్న నేపథ్యంలో అత్యాధునిక వంగడాలతో ఉద్యాన పంటల్లో.. మెళకువలు, బిందు సేద్యం, మల్చింగ్ విధానం పాటిస్తూ రాణిస్తున్నారు మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కొత్తగూడకు చెందిన కందాడ అశోక్‌రెడ్డి, గంటకోల్ (జీకే) తండాకు చెందిన యువత రైతు సోదరులు గుగులోతు రమేష్, రవి. వీరు తమతమ భూముల్లో లాభాలు పండిస్తూ ఔరా అనిపిస్తున్నారు.

సీజనల్‌గా పండిస్తూ లాభాల బాట

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురం గ్రామశివారు కొత్తగూడకు చెందిన కందాడ అశోక్‌రెడ్డి తనకు ఉన్న 10ఎకరాల భూమిలో తండ్రి వ్యవసాయం చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండటాన్ని గమనించారు. ప్రత్యామ్నాయ పంటలతోనే లాభాలు వస్తాయని గ్రహించి ఐదేళ్లుగా ఉద్యాన పంటలైన సీజనల్ కూరగాయల సాగు, పుచ్చకాయల సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఆరు ఎకరాల్లో పామాయిల్, రెండు ఎకరాల్లో బీరకాయ, కాకరకాయ, ఇతర సీజనల్ కూరగాయలు వేస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న డ్రిప్స్, మల్చింగ్ విధానాన్ని పాటిస్తూ నీటిని ఆదాచేస్తూ, కలుపు నివారణతో ఖర్చులు తగ్గిస్తూ, సాగు చేపడుతున్నారు. కూరగాయలు అధిక ధరలు పలికే వరంగల్, ఖమ్మం మార్కెట్లకు తరలించడంతో పాటు చిన్న, సన్నకారు వ్యాపారులు తోట వద్దకు వచ్చి తీసుకొని నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం బీరసాగు ఖర్చులు పోను రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. అంతేకాకుండా పామాయిల్ పంటలో అంతర్‌పంటగా పుచ్చకాయల సాగును చేపట్టారు.



అమ్మాపురంలో రైతు అశోక్‌రెడ్డి సాగు చేస్తున్న బీరకాయ తోట



జీకే తండాలో రమేష్, రవి సాగు చేస్తున్న చామంతి పూలసాగు

చామంతి సాగుతో ఆదాయం

తొర్రూరు మండలం గంటకోల్ (జీకే) తండాకు చెందిన యువ రైతు సోదరులు గుగులోతు రమేష్, రవి పూలసాగు చేయాలని హార్టికల్చర్ అధికారులను సంప్రదించారు. సాగుపై ఉన్న సబ్సిడీలను తెలుసుకొని పూల సాగులోనే బంగారు భవిష్యత్ ఉందని పూలసాగు చేపట్టి లాభాలు పొందుతున్నారు. రమేష్ తన అన్న రవితో కలిసి జీకే తండాలో ఉన్న ఆరు ఎకరాల్లో రెండు ఎకరాల్లో పాలీహౌస్ ఏర్పాటు చేసుకొని సీజన్ వారీగా చామంతి సాగు చేయడంతో పాటు మూడు ఎకరాల్లో ఆయిల్‌పామ్ వేశారు. ఎకరం భూమిలో సరిపోయే 1.60 లక్షల మొక్కలను ఒక్కొక్కటి రూ.3చొప్పున కొనుగోలు చేసి నాటగా 100 నుంచి 120 రోజుల వ్యవధిలో చేతికి వస్తుంది. ఈ పువ్వులను ఎక్కువగా వివాహ, శుభకార్యాలకు, అలకంరణకు ఉపయోగించడంతో అధిక ధర పలుకుతోంది. చేతికి వచ్చిన పువ్వులను పది మొక్కల వరకు కటింగ్ చేసి బంచ్‌గా ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ఎకరంలో సుమారు 15 వేల బంచ్‌లు దిగుమతి వస్తుంది. ఒక్క బంచ్ రూ.100 నుంచి రూ.150 ధరతో సీజన్ బట్టి విక్రయిస్తుంటారు. మార్కెటింగ్ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా హైదరాబాద్, పెద్దపెద్ద డేకరేషన్ హాల్స్‌కు పంపిస్తుంటారు. మొక్కలుగా కోసి ఇవ్వడంతో పువ్వు వాడిపోకుండా పది రోజుల వరకు తాజాగా ఉంటుంది. ఎకరానికి రూ.6లక్షల వరకు పెట్టుబడి పెట్టగా, చామంతి పూలతో సంవత్సరానికి రూ.15 లక్షల ఆదాయం వస్తే, కూలీల ఖర్చు, ఎరువు మట్టి, ఇతర ఎరువుల ఖర్చు, మొక్కల ఖర్చు సుమారు రూ.8 లక్షల వరకు వస్తుంది. సుమారుగా సంవత్సరంలో రూ.10 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దీనికి తోడు మూడు ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు తెలిపారు. పంట ఆదాయంతో పాటు, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కూడా కలిసొస్తోంది. సంప్రదాయ పంటల కంటే ఉద్యాన పంట సాగుతోనే అధిక లాభాలు వస్తున్నాయని యువ రైతులు ధీమాగా చెబుతున్నారు. వీరితో పాటు ఇదే గ్రామానికి చెందిన గుగులోతు భిక్షం అనే రైతు ఎకరం భూమిలో బెండకాయ, బుడంకాయ, దోసకాయ సాగు చేస్తూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు గడిస్తున్నారు.


నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సమాయత్తం కావాలి

రాంనగర్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : రాబోయే ఏప్రిల్, మే నెలల్లో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అధికారులు పూర్తిగా సమాయత్తం కావాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. 16 సర్కిళ్ల అధికారులతో సీఎండీ సోమవారం సాయంత్రం హనుమకొండ నక్కలగుట్ట విద్యుత్‌భవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. లోడ్ పెరిగే అవకాశం ఉన్న ప్రతీ చోట పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏప్రిల్‌లో కోతలు పూర్తైన తర్వాత వ్యవసాయ సర్వీసులను త్వరతగిన మంజూరు చేయాలన్నారు. అందుకు తగ్గట్లు మెటీరియల్ పూర్తి చేసుకోవాలన్నారు. బంచ్డ్ ఫీడర్లు ఉన్న చోట వీసీబీలు పెట్టి ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. వోల్టేజీని మెరుగుపరచడానికి లైన్‌లలో కెపాసిటర్ బ్యాంకులను ఏర్పాటు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డైరెక్టర్‌లు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

25 ఏళ్ల నాటి బ్యానర్ పునరావిష్కరణ



నాటి ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న కేసీఆర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎర్రబెల్లి దయాకర్‌రావు, పల్లా, వినయ్‌భాస్కర్, నరేందర్ తదితరులు

మట్టెవాడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సుమారు 25 ఏళ్ల నాటి స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార బ్యానర్‌ను సోమవారం రాత్రి బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లో పునర్ ఆవిష్కరించారు. 2001 స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు జడ్పీటీసీగా పోటీ చేసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి వస్త్రంపైన బ్రష్‌తో రాయించిన ఎన్నికల ప్రచార బ్యానర్‌ను నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దాచిపెట్టి ఉంచారు. ప్రస్తుతం పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న నేపథ్యంలో కేసీఆర్‌తో ఆ బ్యానర్‌ను పునరావిష్కరింపజేసి.. నాటి తమ జ్ఞాపకాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పెద్దిని కేసీఆర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు నన్నపనేని నరేందర్, దాస్యం వినయ్‌భాస్కర్, గండ్ర వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

కులవృత్తినే నమ్ముకున్నాడు.. కళాఖండాలు తీర్చిదిద్దుతున్నాడు..

సూక్ష్మకళలో సత్తా చాటుతున్న జయకుమార్



సూక్ష్మకళాకారుడు జయకుమార్



మైక్రో ఆర్టిస్ట్ జయకుమార్ తయారు చేసిన భారతచిహ్నం



సహజ పూలతో సూక్ష్మ బతుకమ్మ చిత్రం

నర్సంపేట, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డిగ్రీ చదివిన అతడికి కొలువు దొరకలేదు. నిరుత్సాహ పడకుండా కులవృత్తినే జీవనోపాధిగా ఎంచుకున్నాడు. తండ్రి వద్ద స్వర్ణకారవృత్తిని ఒంటపట్టించుకున్నాడు. దీంతో ఏదో సాధించాలన్న పట్టుదలతో సూక్ష్మకళాఖండాలను రూపొందించడం ఆరంభించాడు నర్సంపేటకు చెందిన శ్రీరామోజు జయకుమార్. బలపాలపై, సబ్బుబిళ్ల తదితర వస్తువులపై అద్భుతాలు సృష్టిస్తున్నారాయన. నర్సంపేట పట్టణానికి చెందిన భిక్షమాచారి-భద్రమ్మ దంపతుల కుమారుడు జయకుమార్ 1995లో బలపాలపై అద్భుత కళాఖండాలను చెక్కి తన ప్రతిభకు సానబెట్టడం ప్రారంభించారు. నాడు ఈ సూక్షకళాకారుడి కళాఖండాలను, ప్రతిభను 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక పాఠకులకు తొలిసారి పరిచయం చేసింది. అప్పటి నుంచి నేటి వరకు ఆయన అనేక అద్భుత కళాఖండాలను సృష్టించి ప్రముఖుల ప్రశంసలను అందుకున్నారు.

చాక్‌పీసులు, సబ్బులపై శిల్పాలు

జయకుమార్ పెన్సిళ్లు, చాక్‌పీస్‌లు, సబ్బుబిళ్లలపై శిల్పాలు చెక్కి జిల్లా రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందారు. జ్యోతిరావు పూలే అవార్డును కూడా దక్కించుకున్నాడు. 2005 క్రికెట్‌లో అత్యధిక సెంచరీలు సాధించిన సచిన్ టెండూల్కర్‌కు 20 మిల్లీ గ్రాముల బంగారంతో క్రికెట్ బ్యాట్‌ను తయారు చేసి కంటికి కనిపించే అక్షరాలతో మాస్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. 2007లో ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను 7మిల్లీ మీటర్ల ముత్యంపై చెక్కి ఓట్‌ఫర్ ద తాజ్ అని చెక్కారు. 2008 ఏప్రిల్‌లో భారత క్రికెట్ చరిత్రలో 600 వికెట్లు సాధించిన కుంబ్లేకు కేవలం 0.15మిల్లీ గ్రాముల బంగారంతో వికెట్లు, బంతి, బేల్స్‌ను తయారుచేసి ఆయనకు కంగ్రాట్స్ అని రాశారు. 2009లో ముఖ్యమంత్రిగా ఎన్నికైన నాటి వైఎస్ఆర్‌కు చింతాకుపై శుభాకాంక్షలు తెలపారు. 2010లో పోస్టుకార్డుపై వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రాన్ని గీశారు. తెలంగాణ ఉద్యమం ఎగిసిపడుతున్న సమయంలో వెంట్రుకపై జైతెలంగాణ నినాదాన్ని లిఖించాడు. బియ్యపు గింజపై తెలుగు అక్షరాలను చెక్కారు. యువకులు అడ్డదారిలో పయనించకుండా ఆధ్మాతిక భావన అలవర్చుకోవాలని ఓంకారంలో లింగాకారాన్ని తీర్చిదిద్దారు. ఈ విధంగా అనేక సూక్ష్మకళాఖండాలను చిత్రించి ప్రశంసలను అందుకున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులను జయకుమార్ అందుకున్నారు.



ఆకుపై గణపతి చిత్రం

మ్యూజియం ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యం

నిరుపేద స్వర్ణకార కుటుంబంలో జన్మించిన జయకుమార్ కంటికి కనిపించని కళాఖండాలను అనేకం సృష్టించారు. ఎన్నో కష్టాల కోర్చి రూపొందించిన ఈ సూక్ష్మ కళాఖండాలను ప్రజలకు చూపించడానికి మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం ప్రోత్సాహం, ఆర్థిక సాయం అందించాలని, తాను నేర్చుకున్న సూక్ష్మ కళను పదిమందికి నేర్పడంతో పాటు మ్యూజియం ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలని జయకుమార్ కోరుతున్నారు.

బెల్లం, గుడుంబా పట్టివేత

మహబూబాబాద్ రూరల్, మార్చి 17 : మహబూబాబాద్ మండలం వేంనూరు గ్రామశివారులో అక్రమంగా నిల్వ ఉంచిన 170 కిలోల నల్లబెల్లం, 20 కేజీల పటిక, 5 లీటర్ల గుడుంబాను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు మానుకోట రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపా రు. మహబూబాబాద్ రూరల్‌పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సీత్లాతండాకు చెందిన అజ్మీర సురేష్, ఉత్తరతండా శివారు రాయికుంటతండాకు చెందిన భూక్య నర్సింహాలు గత కొద్దిరోజులుగా నల్లబెల్లం తీసుకువచ్చి గుడుంబా తయారుచేసే వారికి విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు దాడులు చేపట్టి వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందుకు బాధ్యులైన భూక్య నర్సింహ, అజ్మీర సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. సుమారు వీటి విలువ రూ.72 వేల వరకు ఉంటుందన్నారు.

ఎట్టకేలకు ఎస్సారెస్పీ జలాలు

డోర్నకల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు డోర్నకల్ మండలానికి ఎస్సారెస్పీ జలాలు చేరుకున్నాయి. శ్రీరాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతమైన డోర్నకల్ మండలానికి ఆదివారం రాత్రినుంచి డీబీఎం-48 ఉప కాలువలైన 21/ఆర్, 4/ఆర్ చేరుతున్నాయి. సోమవారం పెరుమాండ్ల సంకీస వద్ద డోర్నకల్ తహసీల్దార్ కృష్ణవేణి, ఇరిగేషన్ ఏఈ కిషన్‌లు కాలువలోని నీటిప్రవాహాన్ని పరిశీలించారు. చివరి ఆయకట్టు ప్రాంతానికి నీరందించి కుంటలు, చెరువులు,చెక్‌డ్యాంలు నింపాలని రైతులు కొద్దిరోజులుగా ప్రభుత్వాన్ని కోరుతుండడంతో స్పందించిన అధికారులు, ప్రజాప్రతినిధులు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● దంతాలపల్లి (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామవరం 7ఎల్ ఉప కెనాల్ పునరుద్ధరణ పనులకు రైతులు ఒప్పుకున్నట్లు తహసీల్దార్ రాజేశ్వర్ అన్నారు. సోమవారం ఆయన ఆధ్వర్యంలో ఎస్సారెస్పీ ఏఈ రాజ్‌కుమార్



లక్ష్మీపురం కొత్త చెరువు కట్టను, ఎస్సారెస్పీ కాలువలను పరిశీలిస్తున్న తహసీల్దార్ భగవాన్‌రెడ్డి

పాల్గొని డీబీఎం 60 నుంచి వెళ్లే 7ఎల్ ఉప కెనాల భూ సర్వేను చేశారు. ఈ సందర్భంగా రైతులతో రెవెన్యూ అధికారులు మాట్లాడి ప్రభుత్వం నుంచి పారితోషికం అందిస్తామన్నారు. రైతులు సవ్యంగా పనులు జరిగేందుకు సహకరించాలన్నారు. కెనాల్ తవ్వకం విషయంలో రైతులు ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పదని తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏవో వాహిని, గిర్దావర్ నజీముద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ రూరల్ : మహబూబాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో ఎస్సారెస్పీ కాలువల ద్వార వస్తున్న నీటి ఉధృతిని, వీఎస్.లక్ష్మీపురం వద్ద కొత్త చెరువు కట్టను, ఎస్సారెస్పీ కెనాల్‌లో నీటిని మానుకోట తహసీల్దార్ భగవాన్‌రెడ్డి సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలోని తాగునీటి, సాగునీటి సమస్య వస్తే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఎస్సారెస్పీ కాలువ ద్వార నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. ఎస్సారెస్పీ కాలువల ద్వార వస్తున్న నీటిని వృథాచేయకుండ సద్వినియోగంచేసుకోవాలని సూచించారు.

దంతాలపల్లి జీపీకి భవనం మంజూరు

దంతాలపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సోమవారం నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు ఎంపీవో మహ్మద్ అప్సరపాష పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జీపీ భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడంతో ఉన్నతాధికారుల సూచన మేరకు నిధులు రూ.20 లక్షలు మంజూరయ్యాయి. ఈ భవనం నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం జీపీ విధులను నిర్వర్తించేందుకు సూర్యాపేట రోడ్డుకు అద్దెకు తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వివేక్‌రాం తదితరులు పాల్గొన్నారు.

దాట్ల పాఠశాలలో ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ ప్రదర్శన

దంతాలపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాట్ల ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో సోమవారం ఆర్ట్ క్రాఫ్ట్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధానోపాధ్యాయులు కొమ్మవరపు కృష్ణయ్య మట్లాడుతూ క్రాఫ్ట్ టీచర్ మాధవి ఆధ్వర్యంలో కళలు, హస్త కళా నైపుణ్యాల వల్ల మనలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, సాయికుమార్, రోహిణి, ప్రేమ్‌కుమార్, యాకస్వామి, రిషిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యూబీని పునఃప్రారంభించాలి

కేసముద్రం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) :కేసముద్రంలోని మినీ ఆర్‌యూబీని తిరిగి ప్రారంభించాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి మంద భాస్కర్ డిమాండ్ చేశారు. కేసముద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ మూడో లైన్ నిర్మాణంలో భాగంగా కొద్ది నెలల క్రితం మినీ అర్‌యూబీని మూసి వేశారని, దీంతో ప్రజలు రైల్వే ట్రాక్ దాటేందుకు రెండు కిలోమీటర్ల దూరం తిరిగి ప్రయాణం చేయాల్సివస్తోందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే చొరవ రైల్వే పనులు పూర్తి చేసి మినీ ఆర్‌యూబీని పునఃప్రారంభించాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం

కేసముద్రం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపూసపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థుల ఆధ్వర్యంలో హెచ్‌ఎం కోట కనకయ్య ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సూరిపల్లి గ్రామానికి చెందిన పల్లపోతుల లక్ష్మినర్సయ్య విద్యార్థులకు పరీక్షప్యాడ్‌లు, పెన్నులను అందజేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మనిషిని ఉన్నత శిఖరాలకు చేర్చేది విద్య

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): చదువే మనిషిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందంరని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధి శనిగపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదవతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన శంతన్‌రామరాజు మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దాశరథి శ్రీధర్, అధ్యాపకులు వెంకన్న, చాగంటి ప్రభాకర్, చైతన్య, పర్వతాలు, మంజుల పాల్గొన్నారు.

జీపీ ట్రాక్టర్ బ్యాటరీ చోరీ

దంతాలపల్లి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తూర్పుతండా గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్ ఇంజిన్ బ్యాటరీ చోరీకి గురైంది. సోమవారం స్థానిక పంచాయతీ కార్యదర్శి మమతశ్రీ తెలపిన వివరాల ప్రకారం.. జీపీకి చెందిన ట్రాక్టర్ కార్యాలయం ఎదుట ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు 15 రోజుల క్రితం దొంగిలించారన్నారు. చోరీ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఈ నెల 15న తూర్పుతండా నర్సరీలో వివిధ మొక్కలను సైతం పీకేస్తున్నారన్నారు. పూర్తి స్థాయి విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తప్పదని ఆమె హెచ్చరించారు. ఇటీవల జీపీకి సంబంధించిన పరికరాలపై ఉన్నతాధికారులకు నివేదికను పంపామన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మరిపెడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్స్ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగు రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు సోమవారం మరిపెడ ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ దగ్గర ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కార్యకర్తలు నిరసన దీక్ష చేశారు. ఈ సందర్భంగా ఇరుగు రవీందర్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు అందించాలి

గార్ల మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ హాస్టల్‌లో పనిచేస్తున్న కార్మికులకు రోజు వారి వేతనాలు పెంచి అందించే విధంగా ప్రభుత్వం చర్య తీసుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ, గిరిజన ఆశ్రమ బాలికల హాస్టల్‌లో పనిచేస్తున్న రోజు వారి కార్మికుల వేతనాల పెంచాలని కోరుతూ చేపట్టిన సమ్మెను ఆయన ప్రారంభించారు. సమ్మెకు సీపీఎం మండల కార్యదర్శి సత్యవతి సంఘీభావం తెలిపారు. సమ్మెలో గార్ల, బయ్యారం, ఇర్సులాపురం పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

కొత్తగూడ, మార్చి 17(ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం అయిందని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి ఆరోపించారు. కొత్తగూడలో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో రవి మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. విద్యూత్ సరఫరా సరిపడ లేకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు ఆర్థికంగా నష్టపోయారని ఆరోపించారు. సమావేశంలో కొత్తగూడ, గంగారం మండలాల కమిటీ సహయ కార్యదర్శి ల్యాదెళ్ల రాజు, నాయకులు కంగాల పాపన్న, చిద్రబోయిన పాపన్న, సోమ్లానాయక్ పాల్గొన్నారు.

'కులగణన' ఆన్‌లైన్ చేసిన వారికి డబ్బులు చెల్లించాలి

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): కులగణన ధృవపత్రాలు ఆన్‌లైన్ చేసిన డబ్బులను తమకు చెల్లించాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం డేటా ఎంట్రీ ఆపరేటర్లు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ చిలువేరు వికాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో భాగంగా ధృవపత్రాలను ఆన్‌లైన్‌లో చేసేందుకు మండలాలు, మునిసిపాలిటీల వారీగా విద్యార్థులు, నిరుద్యోగులను కంప్యూటర్ ఆపరేటర్లుగా నియమించుకుని ఆన్‌లైన్ ప్రక్రియను అధికారులు ముగించారని చెప్పారు. ఉన్నతాధికారులు చొరవ చూపి తమకు న్యాయం చేయాలని కోరారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా: ఎర్రబెల్లి

పెద్దవంగర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ ప్రజలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. దేవునిబాయి తండాకు చెందిన గుగులోతు సర్యా (65) ఇటీవల మరణించగా, సోమవారం మృతుడి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు మృతుడి కుటంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, శ్రీరాం సుధీర్, రాసాల సమ్మయ్య, పటేల్, వెంకన్న ఉన్నారు.

మానవత్వం చాటుకున్న ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు

మహబూబాబాద్ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళను ఆదుకుని ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు మానవత్వం చాటుకున్నారు. గూడూరు మండలం దామరవంచ గ్రామానికి చెందిన యాకూబ్‌పాషా తల్లి రజియాబేగం తన ద్విచక్రవాహనంపై మహబూబాబాద్‌కు వస్తుండగా కంబాలపల్లి గ్రామం దాటగానే ప్రమాదశాత్తు బైక్‌పై నుంచి కిందపడిపోయింది. ఈఘటనలో రజియాబేగంకు తీవ్రగాయాలు కాగా, కంబాలపల్లి నుంచి మహబూబాబాద్‌కు వస్తున్న ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు భీమానాయక్, మంగీలాల్‌నాయక్, లకావత్ రాంచంద్రునాయక్‌లు రజియాబేగంను చూసి హుటాహుటిన ఆమెను ఎత్తుకుని నీడకు చేర్చి 108 వాహనంకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

డోర్నకల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ -మహ బూబాబాద్ రైల్వే సెక్షన్‌లో గుండ్రాతిమడుగు స్టేషన్ సమీ పంలో కిలోమీటర్ 443-4-6 వద్ద గుర్తు తెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. డోర్నకల్ జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్- డోర్నకల్ సెక్షన్‌ల నడుమ గుండ్రాతిమడుగు సమీపంలో రైలు పట్టాల కింద మృతదేహాన్ని గమనించిన రైలు కీమెన్ గుండ్రాతిమడుగు స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందించారు. ఆయన ఈ విషయాన్ని డోర్నకల్ జీఆర్పీపోలీసులకు తెలిపారు. విష యం తెలుసుకున్న జీఆర్పీ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను పరిశీలించారు. మృతుడి వయస్సు సుమా రు 35 ఏళ్ల వరకు ఉండవచ్చునని జీఆర్పీ పోలీసులు చెప్పారు.

పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : పది ఫలితాల్లో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని జీసీడీవో విజయకుమారి, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి అన్నారు. మహబూబాబాద్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్ ప్రశ్నపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...పదవ తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుండగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయి టాలెంట్ టెస్టులో 100 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పట్ల మధు తెలిపారు. నాయకులు జ్యోతిబసు, సింహాద్రి, రాకేష్, వీరేందర్, సురేష్, మనోజ్, వినోద్ పాల్గొన్నారు.

● పదో తరగతి వార్షిక రీక్షలు ఈ నెల 21న ప్రారంభం కానున్నాయని, ఎలాంటి మానస ఒత్తిడి, ఆందోళన చెందకుండా ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాయాలని ప్రధానోపాధ్యాయుడు మాలోతు కోట్యానాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని కంకరబోడు ప్రభుత్వ ఉన్నత



టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న జీసీడీవో విజయకుమారి, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ నాగవాణి

పాఠశాలలో సోమవారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఉమాదేవి, శకుంతల, ఫాతిమా, ప్రసాద్ పాల్గొన్నారు.

అభ్యసన ఫలితాలు సాధించేలా బోధన చేయాలి

ఎస్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ సభ్యులు అహ్మద్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్/ తొర్రూరు రూరల్/పెద్దవంగర మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తరగతుల వారీగా అభ్యసన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన చేయాలని ఎస్‌సీఈఆర్‌టీ ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ ఎస్.ఎం. అహ్మద్ అన్నారు. మహబూ బాబాద్ జిల్లా కేంద్రంతో పాటు పెద్దవంగర, తొర్రూరు, నెల్లికుదురు మండలాల్లోకి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు, ప్రభుత్వ ఉన్నత, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల స్థాయిలను పరిశీలించి ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించి మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అహ్మద్ మాట్లాడుతూ.. విద్యార్థులు తరగతుల వారీగా అభ్యసన ఫలితాలు సాధించేలా టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం)ను ఉపయోగిస్తూ ప్రణాళిక బద్ధమైన బోధన చేయాలని సూచించారు. పాఠశాల లైబ్రరీ, ఇటీవల ప్రాంభించిన ఆర్టిఫిషియల్ ఇంటలిజన్స్ ల్యాబ్‌ను సమర్థవంతంగా ఉపయోగించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు బోధన అభ్యసన ప్రక్రియను అమలుచేయడంలో తనదైన ప్రత్యేకశైలీ కలిగిఉండాలన్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ...ప్రతి విద్యార్థికి ప్రతి పాఠ్యాంశం పట్ల అవగాహన కలిగిఉండాలని, ప్రశ్నాపత్రాన్ని క్షుణ్ణంగా చదివి వాటికి జవాబులు రాయా లని సూచించారు. పదవ



పెద్దవంగర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న సయ్యద్ మతిన్, ఆజాద్ చంద్ర శేఖర్

తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించడంతో పాటు ఎక్కువ మార్కులు సాధించేలా సంసిద్ధులను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో మహంకాళి బుచ్చయ్య, శ్రీనివాస్, జిల్లా కో-ఆర్డినేటర్ ఆజాద్‌చంద్రశేఖర్, జీసీడీవో విజయకుమారి, కేజీబీవీ ఎస్వోలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

విద్యార్థులకు రవాణా చార్జీలు అందజేత



కాంపల్లిలో రవాణ చార్జీలు అందజేస్తున్న తేజావత్ రాంకిషన్‌నాయక్

సీరోలు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : సీరోలు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 15 మంది, మండలంలోని కాంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 71 మంది మొత్తం 91 పదవ తరగతి విద్యార్థులకు రవాణ చార్జీలకు రూ. 31850 రిటైర్డ్ ఐఏఎస్ అధికారి తేజావత్ రాంచంద్రునాయక్ సోమవారం అందించారు. స్థానిక పాఠశాలల్లో పదో తరగతి విద్యనభ్యసిస్తూ ఈ నెల 21 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో వారికి మోదుగులగూడెం, కురవి మండల కేంద్రాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయించబడగా వారు వెళ్లి వచ్చిందుకు ప్రతి విద్యార్థికి రూ. 350 అయ్యే రవాణా చార్జీలు మొత్తం 91 మందికి రూ. 31850 నగదును రాంచంద్రునాయక్ సోదరుడు తేజావత్ రాంకిషన్‌నాయక్ చేతుల మీదుగా అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు బత్తికి వెంకన్న, కేలోతు అర్జున్‌చౌహాన్, హెచ్‌ఎంలు అరుణశ్రీ, బంగారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థికసాయం

గూడూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద స్నేహితుడి వివాహానికి తనతోపాటు విద్య నభ్యసించిన చిన్ననాటి మిత్రులు రూ.68 వేల ఆర్థిక సాయం అందించారు. మానవతా దృక్పథంతో బాల్య స్నేహితుడు నల్లగొండ అనిల్ వివాహానికి 2003- 2004 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు తమకు తోచిన విధంగా స్నేహితుల వద్ద విరాళాలు సేకరించి రూ.68 వేల నగదును అందించారు.



ఆర్థికసాయం చేస్తున్న అనిల్ మిత్రులు

మునిసిపల్ ఆఫీస్ ఎదుట కాంట్రాక్టర్ల ఆందోళన

మహబూబాబాద్ టౌన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలో చేసిన పలు అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక మునిసిపల్ ఆఫీస్ ఎదుట మునిసిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ బాధ్యులు బోయినపల్లి లక్ష్మణ్‌రావు, మార్నేని కిరణ్ మాట్లాడుతూ... గత రెండు సంవత్సరాలుగా మునిసిపాలిటీ పరిధిలో చేసి పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్ల జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీడీఎఫ్, జనరల్ ఫండ్, ప్లాన్, నాన్‌ప్లాన్‌గ్రాంట్ టీఎఫ్‌ఐడీసీ, పట్టణ ప్రగతి, 15వ ఆర్థిక సంఘం నిధులు ద్వారా మంజూరైన సుమారు రూ.50 కోట్ల పనులకు సంబంధించి బిల్లులు చెల్లించాల్సి ఉందని తక్షణమే ఆ బిల్లులు చెల్లించి కాంట్రాక్టర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉప్పలయ్య, మార్నేని రఘు, సుధాకర్, ఉపేందర్, రాజేష్, ఎల్లయ్య, రామకృష్ణారెడ్డి, సతీష్‌రెడ్డి, శ్రీకాంత్, అనిల్, రాందాస్ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న మునిసిపల్ కాంట్రాక్టర్లు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దవంగర, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని జిల్లా సీఈ (సూపరింటెండెంట్ ఇంజనీర్) జె.నరేష్ అన్నారు. టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని వడ్డెకొత్తపల్లి సబ్‌స్టేషన్‌ను పరిశీలించి, ఆదనపు బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలకు అవసరమైన స్తంభాలు, విద్యుత్ వైర్లును, ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తామన్నారు. విద్యుత్‌షాక్ రాకుండా విధిగా ఎర్త్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రైతులు మోటార్లకు కెపాసిటర్లును బిగించుకోవాలని, దీని ద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై ఆదనపు భారం తగ్గుతుందని తెలిపారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ సిబ్బందిని కోరారు. విద్యుత్‌లో ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా విద్యుత్ శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద రైతులు అప్రమత్తంగా ఉండి ఇబ్బందులు ఉన్నట్లుతే స్థానిక విద్యుత్ అధికారులను తెలియజేయాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈలు మధుసూదన్, సునీత, ఏడీఏ చలపతిరావు ఏఈ రమేష్‌బాబు, జెఎల్ఎంలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

కేసముద్రం, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 20న జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కేసముద్రంలో సోమవారం కరపత్రాలను భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మురళి ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాడబోయిన శ్రీశైలం, మండల ప్రధాన కార్యదర్శి గుంజ పొడుగు శ్రీనివాస్, నెలకుర్తి ఉప్పలయ్య, ముప్ప రవి, పొడుపుగంటి రాంమూర్తి, మేకల వెంకన్న, దాసరి ఎల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

● గూడూరు : అర్హులైన పేదలు ఇళ్ల నిర్మించుకోవడానికి ప్రభుత్వం ఉచితంగా ఇసుకను అందించాలని మండల తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షులు చెల్పూరి శ్రీశైలం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 20న మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాకు సంబంధించిన కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల తాపీమేస్త్రీల సంఘం నాయకులు ఎండి.అంకుస్, సట్ల వెంకన్న, లక్ష్మీనారాయణ, యాకూబ్, నాంపెల్లి వెంకన్న, దయ్యాల ఉపేందర్, జానీ, రత్నం, కొంకటిబాబు, రమేష్ పాల్గొన్నారు.



కేసముద్రంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ మండలం కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం పదోతరగతి విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో పరీక్ష సామాగ్రి అందజేశారు. స్థానిక పాఠశాలలో సోమవారం 71 మంది ఎస్సెస్సీ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు మేకల కృష్ణయ్య, ఉపేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సోహన్‌బీ, ఉప్పలయ్య, శ్రీనివాసరావు, తిరుపతి, శిబారాణి, సతీష్‌కుమార్, సోమేశ్వర్, ఝాన్సీ కృష్ణమూర్తి, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, వీరభద్రం, యుగందర్, కవిత పాల్గొన్నారు.

ముక్తేశ్వరస్వామి ఆలయ అర్చకుడి కన్నుమూత

డోర్నకల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ మండలం అమ్మపాలెంలోని శ్రీముక్తేశ్వరస్వామి ఆలయ అర్చకులుగా గత 40 ఏళ్లుగా పనిచేస్తున్న హరిశ్రీనివాసశర్మ(70) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. డోర్నకల్ అమ్మపాలెం, తహసీల్దార్ బంజర గ్రామాల్లో ఆర్‌ఎంపీ వైద్యులుగా ఆయన ప్రజలకు సేవలందించారు. మృతుడు శ్రీనివాసశర్మకు ఐదుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

మిర్చి ధరను పెంచి రైతులను ఆదుకోవాలి

మరిపెడ, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : మిర్చి ధరను పెంచి రైతులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మరిపెడ మండల సీపీఐ కార్యదర్శి మారగాని బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మరిపెడలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తక్షణం మిర్చి ధర పెంచి రైతులను ఆదుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేసి వ్యవసాయ మార్కెట్లను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఎస్సారెస్పీ జలాలను విడుదల చేసి ఎండిపోతున్న వరి పంటను కాపాడాలన్నారు. ఆ పార్టీ నాయకులు అబ్దుల్ రషీద్, అంజి, నారాయణ, భద్రు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

తొర్రూరు, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కో-ఆపరేటివ్ బ్యాంకు సేవలను వినియోగించుకోవాలని ఆ బ్యాంకు చైర్మన్ చెరుకూరి కృష్ణమూర్తి అన్నారు. సోమవారం తొర్రూరు డివిజన్ కేంద్రంలో భద్రాద్రి కో-ఆపరేటివ్ నూతన శాఖను ప్రారంభించారు. కార్యక్రమంలో సీఈవో రమేష్, దారం ప్రసాద్, చెరుకూరి స్వరూప్‌కుమార్, గౌరీశంకర్, ప్రసాద్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పోలీస్ వాహనాల పనితీరు పరిశీలన

మహబూబాబాద్ రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆదేశాల మేరకు డీఎస్పీ, రూరల్ సీఐ, ఎస్సై వాహనాల పనితీరును ఎంటీవో సోములు పరిశీలించారు. ఈ సందర్భంగా సోములు మాట్లాడుతూ.. వాహనాల డ్రైవర్లు ప్రతిరోజు వాహనాల కండీషన్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని చెప్పారు. ఈ తనిఖీల్లో రూరల్ సీఐ సర్వయ్య, ఎస్సై దీపికరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇనుగుర్తి, మార్చి 17 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తికి చెందిన చీదురు సోమయ్య, గంజి కొమురారెడ్డిలు ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ఆది వారం రాత్రి పరామర్శి ంచారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం దుర్గేష్, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి, బేతమల్ల చంద్రయ్య, పింగిళి శ్రీనివాస్, గుజ్జునూరి వెంకన్న, పప్పుల వెంకన్న, గాడుదుల రాజాలు మహేందర్ ఉన్నారు.



చీదురు సోమయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న శంకర్‌నాయక్